# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమం, మేలు కోరే ప్రభుత్వమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
2. హైదరాబాదు నుంచి మచిలీపట్నం వరకూ 12 వరుసల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
3. విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు.
4. తెలంగాణ వ్యాప్తంగాకాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా -సిసిఐ పత్తి కొనుగోళ్లను ఈరోజు నుంచి ప్రారంభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.
5. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఈరోజు నిర్వహించుకుంటున్నాం.

=========================

కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమం, మేలు కోరే ప్రభుత్వమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దీపావళి వెలుగులు శాశ్వతం కావాలని, ప్రజలకు ప్రతీ రోజు పండుగ కావాలని దేవుని ప్రార్థించినట్లు సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నివాసంలో కుటుంబ సభ్యులతో కలసి ఆయన నిన్న దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సతీమణి భువనేశ్వరితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

విశాఖపట్నంలో వచ్చే నెల 14 నుంచి రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు తరలివచ్చి రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ – ఏఐబిసి ప్రతినిధులతో సిడ్నీలో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని, అదేవిధంగా అనుభవం కలిగిన సమర్థ నాయకత్వం ఉందన్నారు.

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా  నేటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–సిసిఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పొడవు గింజ కలిగిన పత్తిని క్వింటాల్ కు 8 వేల 110 రూపాయల చొప్పున ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈరోజు జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో 'పప్పు దినుసుల్లో అధిక దిగుబడి' అనే అంశంపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.

-----------------------------

సామాన్య ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచేలా కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను – జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చిందని బాపట్ల శాసన సభ్యులు వి.నరేంద్ర వర్మ తెలిపారు. 2047 నాటికి దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' ముగింపు కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ..

(వాయిస్.. 35 సెకన్లు)

-----------------------------

విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి  మాట్లాడుతూ.. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు అన్ని విధాలా మేలు చేసేలా పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని మంత్రి వెల్లడించారు.

-----------------------------

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఈరోజు నిర్వహించుకుంటున్నాం. 1959లో చైనా సరిహద్దులో విధి నిర్వహణలో ఉన్న భద్రతాదళాల సిబ్బంది దేశరక్షణ కోసం చేసిన ప్రాణ త్యాగాలను ఈ సందర్భంగా దేశం స్మరించుకుంటూ వారికి నివాళులర్పిస్తోంది. దీంతోపాటు, గత ఏడాది కాలంలో విధి నిర్వహణలో అమరులైన భద్రతా దళాల సిబ్బంది, పోలీస్ సిబ్బందిని కూడా ఈరోజు స్మరించుకుంటున్నారు.

కాగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా, మంగళగిరిలోని 6వ బెటాలియన్ ఆవరణలో నిర్వహించనున్న పోలీసుల అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించనున్న పోలీసుల అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

-----------------------------

హైదరాబాదు నుంచి మచిలీపట్నం వరకూ 12 వరుసల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిన్న నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని.. సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తుందని తెలిపారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం, హైదరాబాదు – మచిలీపట్నం రహదారి అభివృద్ధితో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నట్లు కొల్లు రవీంద్ర వెల్లడించారు.

----------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను – జిఎస్టిని తగ్గించడంతో ద్విచక్రవాహనాల విక్రయాలు బాగా పెరిగాయని విక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ద్విచక్రవాహనాలపై ఉన్న 28 శాతం జిఎస్టిని ప్రస్తుతం 10 శాతానికి తగ్గించడంతో ఒక్కో వాహనంపై 10 వేల నుంచి 15వేల రూపాయల వరకూ ధర తగ్గుతుందని ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా కేంద్రంలోని వాహనాల విక్రయ సంస్థ మేనేజర్ వేణుగోపాల రెడ్డి తెలిపారు. జిఎస్టి సంస్కరణపై ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్.. 27 సెక్లను)

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

----------------------------

దక్షిణ అండమాన్ సముద్రం, ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భాతర వాతావరణ కేంద్రం వెల్లడించింది. వచ్చే 48 గంటల్లో ఇది పశ్చిమ – వాయువ్య దిశగా కదులుతూ దక్షిణమధ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్..20 సెకన్లు

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భాతర వాతావరణ కేంద్రం తెలిపింది.

======================